క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా వేణుబాబు



మాచర్ల: పురపాలక సంఘ కమిషనర్‌గా డి.వేణుబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మాచర్లలో పనిచేస్తున్న కమిషనర్ వెంకట్‌దాస్ సాధారణ బదిలీలలో భాగంగా గిద్దలూరుకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో తాత్కాలిక ఇన్‌చార్జి కమిషనర్ నాగేశ్వరరావు బాధ్యతలు నిర్వహించారు. గుంటూరు కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డి.వేణుబాబును మాచర్ల కమిషనర్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయనను పురపాలక సంఘ అధికారులు, ఏఈలు, సచివాలయ అడ్మిన్‌లు, సిబ్బంది పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

రెంటచింతల ఎంపీడీఓగా సరోజినీదేవి



రెంటచింతల: ప్రజా సమస్యలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎంపీడీఓ సరోజినీదేవి సూచించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామాలలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమష్టిగా కృషి చేసినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. అనంతరం మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి, పార్టీ నాయకులు బి.రామకృష్ణ, ఎం.ప్రభురాజు, మర్రి రాజ్‌కుమార్, గొంటు రవికుమార్‌రెడ్డి, లింగయ్య, మొండెద్దు చిన శౌర్రెడ్డి తదితరులు ఎంపీడీఓను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

జిల్లా పోటీలకు విద్యార్థులు



రెంటచింతల: కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్-14, అండర్-17 నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ, వాలీబాల్ పోటీలలో స్థానిక శ్రీ రామకృష్ణ గురుకుల పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభను ప్రదర్శించి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, పీఈటీ వెంకటేష్ శుక్రవారం తెలిపారు. కబడ్డీ, వాలీబాల్ అండర్-14, అండర్-17 విభాగాలకు పాఠశాలకు చెందిన మొత్తం 9 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి జిల్లా జట్లకు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కబడ్డీ, వాలీబాల్ పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులను పాఠశాల ప్రెసిడెంట్ ఆత్మకూరి నాగేశ్వరరావు, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సీపీఎం మండల కార్యదర్శిగా తిక్కా నాగేశ్వరరావు



రెంటచింతల: సీపీఎం మండల కార్యదర్శిగా రెంటచింతలకు చెందిన తిక్కా నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.ఆంజనేయనాయక్, బి.మహేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు మహంకాళి ప్రకాశ్‌రావు అధ్యక్షతన నిర్వహించిన రెంటచింతల సీపీఎం శాఖ మహాసభలో నాగేశ్వరరావును ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ సభలో ఉప్పుతోళ్ల గురులింగరాజు, తోటిచర్ల ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మాచర్ల: పట్టణంలోని రైల్వే గేటు వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అనాథ మృతి చెందినట్లు పట్టణ సీఐ ప్రభాకర్ గుర్తించి స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు వారికి సమాచారం అందించారు. స్పందించిన ట్రస్టు ఫౌండర్, చైర్మన్ మెట్టు గోవిందురెడ్డి సీఐ, సిబ్బంది సహకారంతో అంత్యక్రియలు జరిపారు.

తాపీ కార్మికుడి మృతి

చిలకలూరిపేటటౌన్: తాపీ పనులు నిర్వహిస్తున్న క్రమంలో కార్మికుడు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన ఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. పట్టణానికి చెందిన పాలెపోగు ఇమ్మానీయేలు (48) మేదర బజారులో ఉన్న ఓ ఇంటి ఆధునికీకరణ పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

జగజ్జననీ జయహే



పాత మాచర్లలో గాయత్రీదేవి అలంకారంలో వాసవీమాత



రెంటచింతల పాలువాయి జంక్షన్‌లో కనక దుర్గ గుడిలో ధనలక్ష్మీదేవి అలంకారం



పిడుగురాళ్లలో ధనలక్ష్మిగా వాసవీ అమ్మ



మాచవరం మండలం చెన్నాయపాలెంలో గాయత్రీ దేవిగా అమ్మవారు



మాచవరంలో వారాహీదేవిగా అమ్మవారు



పిడుగురాళ్లలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దాచేపల్లిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి గుడిలో పూజలు చేస్తున్న మహిళా భక్తులు



నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద విద్యుద్దీప కాంతుల్లో కనక దుర్గ గుడి

దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. రెండోరోజు అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. శుక్రవారం కావడంతో కుంకుమ పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవార్లు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు. కొన్నిచోట్ల ధనలక్ష్మిగా మెరిశారు. కొన్నిచోట్ల వేదమాత గాయత్రీదేవిగా కటాక్షించారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని తిలకించి భక్తులు పులకించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

– మాచర్ల/ రెంటచింతల/పిడుగురాళ్ల/మాచవరం/దాచేపల్లి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఎం.సైదారావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని తెలిపారు. మెయిన్ రోడ్డు, ఉషోదయ సూపర్ మార్కెట్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు, ప్రజాశక్తి నగర్, బెల్లంకొండ డొంక ప్రజలకు కరెంట్ ఉండదని పేర్కొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



దాచేపల్లి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపించారని నడికుడి దుర్గా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లికార్జున శాస్త్రీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో తమ విద్యార్థులు మహతి, యశ్వస్విని రెండు, మూడు స్థానాల్లో నిలిచారని ఆయన చెప్పారు. హైజంప్‌లో సిరి చందన 3వ స్థానం, రేస్‌వార్‌లో సాఫియా 3వ స్థానం, 3కే రన్‌లో సుమిత్‌కుమార్ రెండో స్థానం, 5కే రన్‌లో యశ్వస్విని, రక్షిత రెండో స్థానంలో నిలిచారని ఆయన పేర్కొన్నారు. విజేతలైన విద్యార్థులను సాగర్ సిమెంట్స్ యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులను బహిష్కరిస్తున్న న్యాయవాదులు

పిడుగురాళ్ల/గురజాల: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కుమారస్వామి మాట్లాడుతూ... జిల్లా బార్ అసోసియేషన్ పిలుపు మేరకు అడ్వకేట్ యాక్ట్ ఆమెండమెంట్ బిల్ నెంబర్-42ను నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. కార్యక్రమంలో సెక్రటరీ వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ పి.మణి, బి.దాస్, న్యాయవాదులు యు.కోటేశ్వరరావు, ఎస్కే మౌలాలి, కె.కోటేశ్వరరావు, ప్రశాంత్ నాయక్, అచ్చారాయి, ఎస్.నవ్య, ఎం.లోకేశ్వరు, ఎస్పీ కోటేశ్వరరావు, అయాజ్, ఎ.రూత్ బెనియన్, సీతరామయ్య, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

■ గురజాల బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం విధులకు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, చల్లా రామిరెడ్డి, బీఎస్‌వీ హనుమంతరావు, కె.హరి సత్యనారాయణ, కె.ప్రభుదాసు, ఆచంట శ్రీనివాసరావు, కత్తి చలమరాజు, కర్రా చినకోటేశ్వరరావు, సీహెచ్ సురేష్, నరసింహారెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో తనిఖీలు



మాచవరం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మండల ప్రత్యేక అధికారి బి.శ్రీకృష్ణదేవరాయలు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గంగిరెడ్డిపాలెం గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు చేపట్టి సిబ్బంది సమయ పాలన రికార్డులు, పరిసరాలను పరిశీలించి ఆరోగ్య సేవా కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రంలో పంట నమోదు సూపర్ చెక్ జాబితాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ కె.రామమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు, పీహెచ్‌సీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

•అవ‘స్థల’ వేదన



వికలాంగుల కాలనీ రహదారి పక్కనే ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న మురుగు నీరు



గుంటూరు రోడ్డులో ఖాళీగా ఉన్న స్థలంలో చేరిన వర్షపు నీరు

ఈచిత్రాల్లో కనిపిస్తున్న ఖాళీస్థలాల వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చిచెట్లు మొలిచి ఉన్న ఇవి చిన్నపాటి వర్షానికే మునిగిపోతున్నాయి. మురుగుచేరి దోమలు ప్రబలుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. గురజాల నగర పంచాయతీ పరిధిలోని చేపల కాలనీ, వికలాంగుల కాలనీ, రజక కాలనీ, శ్రీరాంపురం ఏరియాలోతోపాటు గ్రామాల్లో ఖాళీ స్థలాల వల్ల పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీస్థలాల్లో మురుగునీరు పారదోలి పిచ్చిమొక్కలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – గురజాల

జాతీయ ఫెస్ట్‌లో బహుమతులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు

నరసరావుపేట రూరల్: జాతీయ స్థాయిలో గుంటూరు కల్లం హరనాథరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన సంకల్ప్ టెక్ ఫెస్ట్‌లో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో నాల్గవ సంవత్సరం విద్యార్థులు రామారావు, రామంజనేయులు ప్రథమ బహుమతి, టెక్నికల్ క్విజ్‌లో వేణుగోపాల్, మోహన్‌లు ద్వితీయ బహుమతి సాధించినట్టు వివరించారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బి.వెంకటశివ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, అధ్యాపకులు అభినందించారు.

ఫైనాన్స్ సిబ్బంది తీరుపై నిరసన



వినుకొండ(నూజెండ్ల): చోళ మండల్ ఫైనాన్స్ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలంటూ న్యూహెచ్‌ఎంసీ అసోసియేషన్ తరఫున వినుకొండ పట్టణంలోని చోళ మండలం ఫైనాన్స్ ఆఫీస్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు పల్నాడు జిల్లా మినీట్రక్స్ అండ్ ఓనర్స్ డ్రైవర్స్ ర్యాలీ నిర్వహించారు. చోళ మండల్ ఫైనాన్స్ వారి దౌర్జన్యం వల్ల వినుకొండ పట్టణానికి చెందిన దావులూరి కళ్యాణ్ చౌదరి ఆత్మహత్య ప్రయత్నం చేసి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడన్నారు. దీని కి కారణమైన ఫైనాన్స్ మేనేజర్‌పై, ఎగ్జిక్యూటివ్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణసీఐకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్తిక్, కరిముల్లా, కుమార్, బాజీ, మసూద్, మస్తాన్, ముల్లా బాషా తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు తొలగించాలి

దాచేపల్లి : వ్యవసాయంపై ఎటువంటి విద్యుత్ చార్జీలను పెంచబోమని రైతులకు హామీ ఇచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లను తక్షణమే తొలగించాలని భారత్ కిసాన్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరాలపాటి జానీ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యుత్, ఇంధన సర్దుబాటు చార్జీల పెంపు ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలకు పూర్తి వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని, విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల నెపంతో సుమారుగా రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమైందని ఆయన మండిపడ్డారు.

ఉచిత ఇసుక విధానం తక్షణం అమలు చేయాలి



పిడుగురాళ్ల: ఉచిత ఇసుక విధానాన్ని తక్షణం అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత ఇసుక విధానం అమలు కాకపోవడం వల్ల భవన నిర్మాణాలు ఆగిపోయాయని, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు షేక్ సిలార్, మద్దం లక్ష్మయ్య, కాలా అప్పారావు, హుస్సేన్, బాబు, శ్రీకాంత్, షేక్ బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముక్త్యాల రాజా జయంత్యుత్సవం



విజయపురిసౌత్: రాజా వాసిరెడ్డి రామ గోపాల కృష్ణ మహేశ్వర ప్రసాద్ (ముక్త్యాల రాజా) 107వ జయంత్యుత్సవం శుక్రవారం కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగుల ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో నిర్వహించారు. కేసీపీ సీనియర్ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ ముక్త్యాలరాజా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీఎం వెంకటరమణ మాట్లాడుతూ ముక్త్యాలరాజా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి మూల పురుషుడు అని కొనియాడారు. ఆయన కృషి లేకపోతే సాగర్ ప్రాజెక్టు సాధ్యమయ్యేది కాదన్నారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ యూనియన్ ప్రెసిడెంట్ ఒ.శివయ్య, యూనియన్ జనరల్ సెక్రటరీ జీఎల్ నారాయణ, సీఐటీయూసీ సీనియర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆరు లీటర్ల సారా స్వాధీనం



వెల్దుర్తి: రామచంద్రాపురం తండా సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో సారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు చేసి ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సారా తయారు చేస్తున్న ప్రాంతానికి వెళ్లి దాడి చేయగా ఓ ప్లాస్టిక్ క్యాన్‌లో ఆరు లీటర్ల సారాతోపాటు, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సారా తయారు చేస్తున్న 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

6న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ స్థాయి చెస్ పోటీలు



చెస్‌పోటీలపోస్టర్లు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహరావు

మాచర్ల: పట్టణంలోని కిడ్స్ పాఠశాలలో ఈనెల 6న ఆదివారం ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల స్థాయి చదరంగం (చెస్) పోటీలు నిర్వహించనున్నట్లు పల్నాడు చెస్ అకాడమీ నిర్వాహకుడు కోచ్ కె.కిరణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. రెండు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు నేరుగా చెస్ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. గౌరవ అతిథులు ఎంఈఓ అల్లి సురేష్, యనముల కేశవరెడ్డి, డాక్టర్ గుర్రం రాజశేఖరరెడ్డి, రిటైర్డ్ డెప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారెడ్డి, కృష్ణవేణి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వై.వెంకటరామయ్య, పాఠశాలల ప్రిన్సిపాల్ కె.వి.రామకృష్ణ శాస్త్రి పాల్గొంటారన్నారు. పోటీల నిర్వాహకులు ఇన్నారెడ్డి రైస్ మిల్లు, శ్రీకృష్ణా జనరల్ హాస్పిటల్ మేనేజర్ సంజీవ్‌కుమార్, వివిధ కళాశాలలకు చెందిన వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోచ్ కిరణ్, చెంచురెడ్డి, గట్ల కోటిరెడ్డి కోరారు.

చైన్నైకి బస్సు సర్వీసు ప్రారంభం



నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జేబీఆర్

మాచర్ల: పట్టణం నుంచి చెన్నైకి ఆర్టీసీ సంస్థ నూతన సర్వీసును ప్రారంభించటం శుభపరిణామమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి(జేబీఆర్) అన్నారు. శుక్రవారం మాచర్ల నుంచి చెన్నైకి బయలుదేరుతున్న నూతన సర్వీసును ఆయన పూజలు చేసి రిబ్బన్ కట్ చేసి జెండా ఊపి ప్రారంభించారు. దూర ప్రాంతాలకు వెళ్ళే వారికి చెన్నై బస్సు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. మాచర్ల నుంచి రోజూ బెంగళూరు, చెన్నై లాంటి ప్రాంతాలకు బస్సులు నడపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం ఆర్.పిచ్చయ్య, పలువురు టీడీపీ నేతలు యెనుముల కేశవరెడ్డి, కె.దుర్గారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, కుర్రి శివారెడ్డి, బండ్ల బ్రహ్మంతో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

దాచేపల్లి : నడికుడి మార్కెట్ యార్డు సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇరికేపల్లికి చెందిన తారటి కృష్ణ, సింహాద్రి సీతారామాంజనేయరెడ్డి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. వెనుక నుంచి అతివేగంతో వచ్చిన గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనం ద్వారా క్షతగాత్రులను హాస్పిటల్‌కి తరలించారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు ఆచూకీ తెలియాల్సి ఉంది. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ఊరెళితే సమాచారం అందించండి

- లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ సేవలు వినియోగించుకోండి
- తాళం వేసిన గృహాలపై సాంకేతిక నిఘా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ విజయ్ చరణ్, సిబ్బంది

నరసరావుపేటటౌన్: దసరా పండుగను పురస్కరించుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు సమాచారాన్ని తెలియజేస్తే వారి గృహాలపై లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా నిఘా ఉంచుతామని వన్‌టౌన్ సీఐ విజయ్ చరణ్ అన్నారు. శుక్రవారం మానిటరింగ్ సిస్టమ్‌పై పల్నాడు జిల్లా పోలీసులు రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు దసరా పండుగ సందర్భంగా ఎవరైనా ఇంటిని వదిలి ఎక్కడికైనా ఇతర పట్టణాలకు వెళ్తుంటే అట్టి సమాచారాన్ని తెలియజేయాలన్నారు. ఏ రోజు నుంచి ఎన్ని రోజుల వరకు మీ ఇంటికి తాళం వేసి వెళుతున్నారో తెలియపరిస్తే వారి గృహాల వద్ద సాంకేతిక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్ శాఖ ప్రవేశ పెట్టిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లోకి వెళ్లి మీ వివరాలు, చిరునామా, సెల్ నెంబర్ ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్న తర్వాత ఊరు వెళ్లి వచ్చేంతవరకు సీసీ కెమెరా పర్యవేక్షణలో మీ ఇంటి మీద నిఘ ఉంచబడుతుందన్నారు.. తాళం వేసి ఉన్న మీ ఇంటి భద్రత కోసం పోలీస్ శాఖ అందిస్తున్న ఉచిత సేవను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.